గృహ సారథులే విజయ సారథులు

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



శిక్షణా సమావేశంలో మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్ : గృహ సారథులే రేపటి విజయ సారథులని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా పట్టణ విభాగం గృహ సారథులకు, వలంటీర్లకు శిక్షణా సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా తాడేపల్లిగూడెం నియోజకవర్గ పరిశీలకులు మైబాబు మాట్లాడుతూ గృహసారథులు ప్రతి ఇంటిలోని గృహస్తులను కలిసి ప్రతిపక్షాల కుట్రలు, వారి పాలనలోని వైఫల్యాలను తెలియజేయాలన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా వారికి అందిన లబ్ధిని వివరించాలన్నారు. ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో తాను ఎమ్మెల్యేగా తాడేపల్లిగూడెం నియోజకవర్గాన్ని రూ. 800 కోట్లతో అభివృద్ధి చేశామన్నారు. తనకు ముందుగా, తన అనంతరం వచ్చిన ఎమ్మెల్యేలు పట్టణ అభివృద్ధికి చేసిందే మీలేదని చెప్పారు. వైఎస్సార్ తనయుడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో తిరిగి తాను పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ మున్ముందు కూడా అందాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ గెలిపించాలని...అందుకు మీరంతా సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో పోటీ పేదవాడికీ.. పెత్తందారీ వ్యవస్థ మధ్య జరుగుతోందన్నారు. పేదవాడు గెలవాలంటే మళ్లీ జగన్‌కు విజయాన్ని అందించాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో చంద్రబాబు 612 హామీలిచ్చి...ఒక్కటి కూడా నెరవేర్చకుండా ప్రజలను మోసగించారన్నారు. పార్టీ విజయానికి సైనికులా పనిచేయాలని కోరారు. రెండేళ్ల అనుభవంతో వలంటీర్లు ప్రతిపక్షాల వైఖరి, జగన్ పాలన విధానాలపై పూర్తి అవగాహనతో ఉన్నారన్నారు. వలంటీర్ల సహకారంతో గృహసారథులు అవగాహన చేసుకోవాలని తెలిపారు. 2024 ఎన్నికల్లో జగన్ ఏర్పాటు చేసిన వ్యవస్థలే ముఖ్యపాత్ర వహిస్తాయన్నారు. వైఎస్సార్‌సీపీ అత్యధిక మెజార్టీతో గెలుపొందేలా గృహసారథులు, వలంటీర్లు ముందుకు సాగాలని వారికి అవసరమైన సమయంలో తనను సంప్రదించాలని ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కర్రి భాస్కరరావు, వెలనాటి సత్తిబాబు, బోళెం రామలక్ష్మి, రమణ, శిరిగినీడి విజయకృష్ణ, రాజా త్రినాథ్, నగర కార్పొరేషన్ డైరెక్టర్ కర్నాటి కన్నయ్య, నాయా బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పట్నాల గౌరీ గణపతి, కొలుకులూరి ధర్మరాజు, ముప్పిడి సంపత్‌కుమార్, మానుకొండ వెంకటేశ్వరరావు, యజ్జల రాంబాబు, చింతకాయల సత్యనారాయణ, అద్దాల నర్సింహరావు తదితర నాయకులు, కార్యకర్తలు, ఆయా వార్డుల గృహసారథులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

వరాల వెంకన్న ఆలయంలో విశేష పూజలు



అత్తిలి మండలం ఈడూరులో విశేష అలంకరణలో వరాల వెంకటేశ్వరస్వామి

అత్తిలి: ఈడూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీవరాల వెంకటేశ్వరస్వామివారికి శనివారం విశేష పూజలు జరిపారు. వేకువ జామున సుప్రభాత సేవ, తోమాలసేవ, ఉదయం అర్చనలు నిర్వహించి స్వామివారిని విశేషంగా అలంకరించారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాధికాలను చేసారు. పరిసర ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు కాలినడకన ఆలయానికి చేరుకుని, ఏడువారాల నోము నోచుకుని, స్వామివారిని దర్శించుకున్నారు. హాజరైన భక్తులకు దాత సహకారంతో అన్నదానం చేసారు. రాత్రి స్వామివారికి ఊంజల్ సేవ జరిపారు.

తగిన మోతాదులో ఎరువులు వినియోగించాలి



అత్తిలి మండలం పాలూరు రైతు భరోసా కేంద్రంలో ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి వెంకటేశ్వరరావు

అత్తిలి: వ్యవసాయశాఖ సలహాలు, సూచనలు పాటిస్తూ, దాళ్వాసాగులో మంచి దిగుబడులు సాధించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి వెంకటేశ్వరరావు చెప్పారు. అత్తిలి మండలం పాలూరు రైతు భరోసా కేంద్రంలో శనివారం ఆయన ఎరువుల వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రైతులు అవసరమైన మేరకు ఎరువులు వాడాలన్నారు. వరిలో జింక్‌లోపం కనిపించినట్లయితే ఒక లీటరు నీటికి 2 గ్రాముల చిలేటెడ్ జింక్ కలిపి వారం, పదిరోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారీ చేయాలని చెప్పారు. దాళ్వాసాగులో రైతులు 1121 రకం ఎక్కువగా సాగుచేస్తున్నారని, దీనికి బ్యాక్టీరియా ఆకు ఎండు తెగులు వచ్చే లక్షణం ఎక్కువగా ఉందన్నారు. ఆకు ఎండు తెగులు గుర్తించిన వెంటనే 4 నుంచి 5 రోజులు పొలంలో నీరుతీసి ఎండబెట్టాలన్నారు. రైతులు అనవసరంగా ముందస్తు స్ప్రేయింగ్స్ చేయరాదని, దీనివల్ల పెట్టుబడి అధికం అవుతుందని తెలిపారు. పైరు పై పురుగు, తెగులు ఉధృతి కనిపిస్తేనే మందులు వాడాలన్నారు. రైతు భరోసా కేంద్రం ద్వారా అందుతున్న సేవలు, ఈ పంటపై రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి రాజేష్, సర్పంచ్ తానుకొండ దయామణి, ఉపసర్పంచ్ రాపేటి సింహాచలం, ఎంపీటీసీ సభ్యుడు శరకడం రామలింగ విష్ణుమూర్తి, వీఏఏ సాహిత్యదావీదు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ సేవా కార్యక్రమాలు అభినందనీయం



విద్యార్థులకు గట్టిం మాణిక్యాలరావు చేతుల మీదుగా సర్టిఫికెట్స్ బహుకరిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్‌క్లబ్ ఆఫ్ స్పిరిట్ సేవా కార్యక్రమాలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. పట్టణంలోని సిపాయిపేట ఎ–టెక్ కంప్యూటర్స్ నూతన శాఖ కార్యాలయంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ పొందిన విద్యార్థినీ విద్యార్థులకు శనివారం సాయంత్రం సర్టిఫికెట్స్ బహుకరించారు. స్పిరిట్ అధ్యక్షురాలు నూకల జయభారతి అధ్యక్షత వహించారు. తొలుత తాడేపల్లిగూడెం స్పిరిట్ లయన్స్‌క్లబ్ వ్యవస్థాపకులు, లయన్స్‌క్లబ్ ఫస్ట్ జిల్లా గవర్నర్, కైండ్‌నెస్ సొసైటీ వ్యవస్థాపకుడు గట్టిం మాణిక్యాలరావు చికాగోలో జరుగుతున్న అంతర్జాతీయ జిల్లా గవర్నర్ల శిక్షణా తరగతులకు హాజరవుతున్న సందర్భంగా అభినందన సభ నిర్వహించారు. గట్టింనకు అభినందనలు చెబుతూ సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జోన్ ఛైర్మన్ వట్టిప్రోలు రాము, పూర్వ అధ్యక్షుడు పొన్నగంటి శ్రీనివాస్, సీఏ ఎన్‌వీ రమణారావు, బత్తుల ప్రసాద్, టి.పాండురంగారావు, నూకల నాగ మల్లేశ్వరరావు, ఎ.రంజిత్, నార్ని చిన్నబాబు, ఎల్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విలువలతో కూడిన విద్యాబోధన



ఎర్రనీలిగుంట గ్రామంలో ఇంటింటా ప్రభుత్వ పాఠశాల కార్యక్రమం ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

అత్తిలి: జగనన్న విద్యాకానుక ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని, కష్టపడి చదువుకుని అత్యున్నతస్థాయికి చేరుకోవాలని బల్లిపాడు గ్రామ సర్పంచ్ కసిరెడ్డి బాలలక్ష్మీనారాయణ అన్నారు. బల్లిపాడు జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వైఎస్సార్‌సీఎం దత్ ఆధ్వర్యంలో పాఠశాల పనివేళల అనంతరం నిర్వహిస్తున్న ఇంటింటికీ ప్రభుత్వ పాఠశాల కార్యక్రమంలో భాగంగా శనివారం అత్తిలి మండలం వరిఘేడు శివారు ఎర్రనీలిగుంట గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న సర్పంచ్ బాలాజీ మాట్లాడుతూ ఉత్తమమైన విద్యాబోధన చేస్తూ, మంచి ఉత్తీర్ణతాశాతం సాధిస్తున్న బల్లిపాడు ఉన్నత పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించాలన్నా రు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దత్ మాట్లాడుతూ తమ పాఠశాలలో తెలుగు, ఇంగ్లీషు మీడియాలు ఉన్నాయని, పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. తమ పాఠశాలలో నాణ్యమైన విద్యతోపాటు, జగనన్న విద్యాకానుక పథకంలో భాగంగా ప్రభుత్వం కల్పించే ఉచిత సదుపాయాలు, జగనన్న గోరుముద్ద పథకం వంటి వాటి గురించి తల్లిదండ్రులకు వివరించారు. పదో తరగతి విద్యార్థుల ఇళ్లకు వెళ్లి, వారి ప్రగతిని తల్లిదండ్రులకు వివరిస్తున్నామని తెలిపారు. టెన్త్ పరీక్షలు సమీపిస్తున్నందున తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. పరీక్షలు దగ్గరపడుతున్న నేపథ్యంలో తమ పిల్లలు ప్రణాళికా బద్ధకంగా చదువుకునేలా చూడాలన్నారు. ఉన్నత పాఠశాలలో విద్యార్థుల చేరికలను ప్రోత్సహించడం కోసం పాఠశాల పనివేళల అనంతరం ఉపాధ్యాయులందరం ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్నామని హెచ్‌ఎం దత్ చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలించాలి

తణుకు టౌన్: మైనర్ బాలికలకు వివాహం చేయడం చట్టరీత్యా నేరమని ప్రతి ఒక్కరూ ప్రభుత్వం నిర్దేశించిన వయస్సులోనే వివాహం చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె కృష్ణకుమారి చెప్పారు. శనివారం తణుకు రూరల్ మండలం మండపాక గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా బాల్యవివాహాల వలన కలిగే నష్టాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సత్యనారాయణ, వీఆర్‌వో సుబ్బారావు, ఎంఎస్‌కే సుభాషిణి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

పైడిపర్రు ఉన్నత పాఠశాలలో డీఈవో తనిఖీ



ఉన్నత పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా విద్యాశాఖాధికారి ఆర్ వెంకట రమణ

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం పైడిపర్రులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాడు–నేడు పథకంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను జిల్లా విద్యా శాఖాధికారి ఆర్ వెంకటరమణ పరిశీలించారు. శనివారం పైడిపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షిక తనిఖీల్లో భాగంగా పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్వహణకు సంబంధించిన వివిధ రికార్డులతో పాటు పాఠశాలలో నాడు–నేడు పథకంలో చేపట్టిన వివిధ పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించి ప్రశంసించారు. తణుకు డీవైఈవో కార్యాలయ సిబ్బంది, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నేలపాటి వెంకట రమణ, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్‌పీజీ డీలర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏర్పాటు



మాట్లాడుతున్న గ్యాస్ ఏజన్సీ నిర్వాహకుడు గుడిమెట్ల గంగాధరరెడ్డి

అత్తిలి: పశ్చిమ గోదావరి జిల్లా ఎల్‌పీజీ డీలర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక శనివారం అత్తిలి జీవీఆర్ గ్యాస్ ఏజన్సీలో జరిగింది. జిల్లా ఎల్‌పీజీ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నెక్కంటి వేణుగోపాలకృష్ణ, ఉపాధ్యక్షుడిగా ఏఎస్‌వీ గోపాలకృష్ణ, సెక్రటరీగా ఐ మాధవ శ్రీనివాసరావు, కోశాధికారిగా గుడిమెట్ల విజయ్‌నాగ సాయిరెడ్డి ఎన్నికయ్యారు. ఇప్పటి వరకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఎల్‌పీజీ డీలర్స్ అసోసియేషన్ ఉండగా, విభజన అనంతరం పశ్చిమ గోదావరి జిల్లా ఎల్‌పీజీ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏర్పడిందని అత్తిలి జీవీఆర్ గ్యాస్ ఏజన్సీ నిర్వాహకుడు గుడిమెట్ల గంగాధరరెడ్డి చెప్పారు. ఈకార్యక్రమానికి హెచ్‌పీసీఎల్ నిర్వాహకులు 19 మంది, ఐఓసీఎల్ నుంచి 19, భారత్‌గ్యాస్‌నుంచి ఐదుగురు హాజరయ్యారని ఆయన తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి

పెంటపాడు: మండలంలో గృహ నిర్మాణాలకు సంబంధించి జగనన్న కాలనీ ఇళ్లను త్వరగా పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్ కోరారు. పెంటపాడు మండల సమావేశ మందిరంలో శనివారం హౌసింగ్ అధికారులు, ఇంజనీరింగ్ సిబ్బంది, ఎంపీడీవో కార్యాలయ ఇతర సిబ్బందికి గృహ నిర్మాణాలకు సంబంధించి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో జగనన్న లేఅవుట్‌ల్లో ప్రగతిని సమీక్షించారు. ఇంకా నిర్మాణాలు ప్రారంభించని ఇళ్లపై సిబ్బందిని, ఇంజనీరింగ్ సహాయకులను ప్రశ్నించారు. బీబీఎల్ లెవిల్ నుంచి బీఎల్ లెవిల్‌కు వచ్చేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డీఈ ప్రసాద్, ఎంపీడీవో డి. దామోదరరావు, ఏఈ రాజేంద్రకుమార్, వర్కు ఇన్‌స్పెక్టర్‌లు జయరాజు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలిగా రత్నకుమారి



గంజి సుగుణ రత్నకుమారి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆదర్శ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఏలూరు జిల్లా అధ్యక్షురాలుగా ద్వారకాతిరుమల మండలం పి.కన్నపురం గ్రామానికి చెందిన గంజి సుగుణ రత్నకుమారిని ఎంపిక చేశారు. ఆర్గనైజేషన్ కార్యవర్గ సమావేశం ఆర్గనైజేషన్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు రొక్కాల నాగబుజ్జి ఆధ్వర్యంలో శనివారం తాడేపల్లిగూడెం పట్టణంలో జరిగింది. రత్నకుమారిని మాట్లాడుతూ ఆదర్శ సోషల్ సర్వీస్ ద్వారా పేదలకు ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తామన్నారు.

సంక్షేమ పాలన జగనన్నకే సాధ్యం

- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- నీలాద్రిపురంలో గడపగడపకు మన ప్రభుత్వం



నీలాద్రిపురం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: సంక్షేమ పాలన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. శనివారం సాయంత్రం తాడేపల్లిగూడెం మండలం నీలాద్రిపురం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును ప్రజల్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ దోపిడీదారులంతా ఒక పక్క ఉంటే పేదల పక్షాన సీఎం జగన్ ఉంటూ ఒంటరిగా పోరాటం చేస్తున్నారని అన్నారు. రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తుంటే సోమరిపోతులను చేస్తున్నారంటూ చంద్రబాబు వ్యాఖ్యానించడం సిగ్గు చేటన్నారు. చంద్రబాబు తన హయాంలో ఏనాడైనా పేదలకు సంక్షేమ పథకాలు అందించారా ?అని ప్రశ్నించారు. మహిళలను చంద్రబాబు నమ్మించి మోసం చేశాడని విమర్శించారు. జగన్ పాలనలో పేదోడికి న్యాయం జరుగుతుంటే సహించడం లేదన్నారు. దీనికి ఎల్లో మీడియా వత్తాసు పాడుతూ జగన్ పాలనపై దుష్ప్రచారం చేస్తోందన్నారు. పేదల గురించి ఆలోచించలేని పవన్ రాజకీయాల్లో ఏం చేయగలడని ప్రశ్నించారు. ఆయనకు నీతి, నియమం ఉందా ? అని నిలదీశారు. ఓట్లు రాకపోయినా చంద్రబాబు ఇచ్చే కుక్క బిస్కెట్లతో పబ్బం గడుపుకుంటున్నాడని విమర్శించారు. టీడీపీ ఇచ్చే సొమ్ములకు జనసేన, కమ్యూనిస్టులు అమ్ముడుపోయారని ఆరోపించారు. సీపీఐ గతంలో పేదోడి పక్షాన నిలబడేదని, నేడు చంద్రబాబుకు తాళం వేస్తుందని దుయ్యబట్టారు. దారిద్ర రేఖకు ఎగువనున్న వారికి సైతం సీఎం జగన్ సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. రైతాంగాన్ని ఆదుకునేందుకు ఆర్‌బీకే వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. విద్యార్థుల ఉన్నత భవిష్యత్ కోసం నాడు–నేడు ద్వారా పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నారన్నారు. మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యమైన ఆహారాన్ని అందిస్తున్నారన్నారు. తాజాగా విద్యార్థులకు అల్పాహారంగా రాగి మాల్ట్ అందించేందుకు సీఎం జగన్ మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారన్నారు. ఏనాడు చంద్రబాబు ఇటువంటి ఆలోచన చేయలేదన్నారు. జగన్ పాలనలో ప్రతి పేదోడికి సంపూర్ణ న్యాయం జరుగుతుందని, ఈ పాలనను కాపాడుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, ఎంపీపీ పానుకుమాటి శేషులత, సర్పంచ్ రాజమహేంద్రవరపు లక్ష్మణరావు, వైస్ ఎంపీపీ సూర్పని రామకృష్ణ, ఎమ్పీటీసీలు మట్ట సత్యనారాయణ, మార్లపూడి సుబ్బారావు, జంపెల్ల సత్యవతి, సర్పంచ్‌లు చింతా వెంకట్రావు, ఉప సర్పంచ్ మేణ్ణి రామారావు, సొసైటీ చైర్మన్లు వెలిశెట్టి నరేంద్రకుమార్, జడ్డు హరిబాబు, చిక్కాల సత్యనారాయణ, గుమ్మళ్ళ తాతారావు, పరిమి తులసీదాస్, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ముప్పిడి వెంకట్రామిరెడ్డి (పెద్దబ్బులు రెడ్డి), మండల సచివాలయాల కన్వీనర్ ముప్పిడి సంపత్‌కుమార్, మండల సేవాదళ్ చైర్మన్ కొండుబోయిన కృపావరం, మండల మహిళా సమాఖ్య మాజీ అధ్యక్షురాలు కొల్లా విజయలక్ష్మికుమారి, తహసీల్దార్ వైకేవీ.అప్పారావు, ఎంపీడీవో ఎం.వెంకటేష్, పీఆర్ ఏఈ జి.పవన్‌కుమార్, కార్యదర్శి టి.పవన్‌కుమార్, హౌసింగ్ ఏఈ వైవి.వెంకట్రావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ ఆర్.శ్రీనివాస్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పాల్గొన్నారు.

క్లుప్తంగా

బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండి చేయి



గూడ్స్ షెడ్డు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు, కార్మికులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ సామాన్య, మధ్య తరగతి ప్రజలకు ఏమాత్రం ఉపయుక్తంగా లేదని సీపీఎం మండల కమిటీ కార్యదర్శి చిర్ల పుల్లారెడ్డి అన్నారు. గూడెంలో శనివారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రానికి, జిల్లా అభివృద్ధికి నిధులు కేటాయింపులు లేవన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే రాష్ట్రానికి ప్రత్యేక హోదా అవసరం అన్నారు. వెనుకబడ్డ ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీలు, రైల్వే జోన్‌లు, కడప ఉక్కు ఫ్యాక్టరీ, దుగ్గిరాల పోర్టు, పోలవరం ప్రాజెక్టు హామీలు నెరవేర్చలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కర్రి సాయి రెడ్డి, అడప ఆంజనేయులు, పి.దుర్గా, ధనలక్ష్మి, గంగరాజు, కోదండరామిరెడ్డి, సుబ్బిరెడ్డి, నారాయణ, కృష్ణ, నాని, కృష్ణ, పుత్రయ్య, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ వెళ్లి... పింఛన్ అందజేసి..



విజయవాడలో పింఛను సొమ్మును అందజేస్తున్న వలంటీర్ రవికుమార్

తణుకు అర్బన్: పట్టణంలోని 4వ వార్డుకు చెందిన వలంటీర్ రవికుమార్ విజయవాడలో వైద్య సేవలు పొందుతున్న వృద్ధుడికి పింఛన్ అందజేసి ఆదర్శంగా నిలిచారు. విషయం తెలుసుకున్న వలంటీర్ విజయవాడ నాగార్జున హాస్పిటల్‌కు వెళ్లి పింఛన్ అందజేశారు. ఈ సందర్భంగా పట్టణ వాసులు వలంటీర్‌ను ప్రత్యేక అభినందనలు తెలిపారు.


తేతలిలో ఘనంగా గోగులమ్మ జాతర



అమ్మవారిని దర్శించుకుంటున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం తేతలి గ్రామంలో గోగులమ్మ జాతర మహోత్సవాన్ని శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ కార్యక్రమాలను మంత్రి కారుమూరి పరిశీలించి మాట్లాడారు. తేతలి గోగుమ్మ జాతర మహోత్సవాల సందర్భంగా గ్రామంలోని ప్రధాన రహదారికి రెండు వైపులా రంగు రంగుల విద్యుత్ దీపాల అలంకరణలు చేయడంతో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన కళా బృందాల ప్రదర్శనలు పలువుర్ని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, నాయకులతో పాటు తేతలి పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

క్యాంపస్ సెలక్షన్స్‌లో శశి పూర్వ విద్యార్థిని ఎంపిక



విద్యార్థినిని అభినందిస్తున్న శశి కళాశాల యాజమాన్యం

తణుకు టౌన్: తణుకు శశి ఇంగ్లీష్ మీడియం స్కూల్ పూర్వ విద్యార్థిని ఆకుల దోదీప్యశ్రీ ప్రతిష్టాత్మక మల్టీనేషనల్ కంపెనీలో రూ. 9 లక్షల వార్షిక వేతనంతో క్యాంపస్ సెలక్షన్స్‌లో ఎంపికైనట్లు శశి విద్యా సంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాల కృష్ణ తెలిపారు. ప్రస్తుతం దోదీప్యశ్రీ తంజావూరులోని కంప్యూటర్ ఇంజనీర్‌గా చదువుతూ స్నైడర్ ఎలక్ట్రానిక్స్ సంస్థ నిర్వహించిన క్యాంపస్ సెలక్షన్స్‌లో ఉద్యోగానికి ఎంపికైనట్లు తెలిపారు. ఈ విద్యార్థినీ 2016–17 విద్యా సంవత్సరంలో తణుకులోని శశి ఇంగ్లీష్ మీడియంలో డేస్కాలర్‌గా చేరి అనంతరం ఇక్కడే ఇంటర్ విద్యను పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని శశి విద్యా సంస్థల వైస్ చైర్మన్ మేకా నరేంద్ర కృష్ణ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ క్రాంతి సుధ, క్యాంపస్ ఇన్‌చార్జి నిమ్మగడ్డ రాజేంద్రప్రసాద్, ప్రిన్సిపాల్ నల్లూరి రాఘవేంద్రరావు, వైస్ ప్రిన్సిపాల్ వెలగల సత్యనారాయణరెడ్డి తదితరులు విద్యార్థినిని సత్కరించారు.